# అహింసాయుత చర్యలు మార్పుల కారకాలు

## Agents of Change and Nonviolent Action

**Hardy Merriman**
Conservation Bilogy, Volume 22, No. 2, April 2008
Translation: March 2018

# TRANSLATOR'S NOTES

# అహింసాయుత చర్యలు మార్పుల కారకాలు

సాధారణ ప్రజలు తమ హక్కులు, స్వేచ్ఛలు, న్యాయం కోసం పోరాడే పద్ధతి అహింసాయుత చర్య. సాధారణంగా ఇది నైతికతకు సంబంధించిన అహింసగా భావించడం జరుగుతుంది. కాని ఇక్కడ మనం కాస్త విభిన్నంగా దీని గురించి మాట్లాడుకుందాం. నైతికమూల్యాలకు వేరుగా దీన్ని అర్థం చేసుకుందాం. ఒక పోరాటంలో పైచేయి సాధించడానికి ఈ పద్ధతి ఎలా హేతుబద్ధంగా ఆచరణాత్మకంగా ఉపయోగపడుతుందో చర్చిద్దాం.

ఒక సమాజంలో అధికారమన్నది మౌలికంగా ప్రజల విధేయత, సమర్థింపుల ద్వారా మాత్రమే లభిస్తుందన్న వాస్తవదృష్టిపై అహింసాయుత పోరాటం ఆధారపడి ఉంది. దీనికి భిన్నంగా సాధారణంగా వినబడే అభిప్రాయమేమంటే, సమాజంలో అధికారమన్నది ఎవరి వద్ద సంపద పోగుపడి ఉంటుందో, ఎవరు హింసాకాండకు పాల్పడే శక్తి కలిగి ఉంటారో వారిదే అని భావించడం. కాని జీవావరణంలోని భాగంగానే ఆర్థికవ్యవస్థ ఉంటుంది. కాబట్టి ఆర్థికవ్యవస్థ కూడా జీవావరణ సూత్రాలపైనే పనిచేస్తుంది. అదేవిధంగా అధికారిక వ్యవస్థ కూడా అది చూడ్డానికి హింసాకాండ, సంపద, బలప్రయోగాలపై ఆధారపడి ఉన్నట్లు కనిపించినా నిజానికి వేలాది, లక్షలాది ప్రజల విస్తృత వ్యవహారశైలిపై, వారిలో ఉన్న విధేయతపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రజలు తమ వ్యవహారశైలి మార్చుకుంటే, తమ విధేయతను మార్చుకుంటే, వారు విశ్వాసాన్ని కోల్పోతే సమాజంలో అధికారం, ప్రపంచంలో అధికారం కూడా చేతులు మారిపోతుంది. క్లుప్తంగా చెప్పాలంటే ప్రజలు విధేయత చూపకపోతే పాలకులు కాని, కార్పోరేషన్లు కాని ఎవ్వరూ పరిపాలించలేరు.

అహింసాయుత చర్యలకు ఉన్న బలమిదే. సామూహిక స్థాయిలో ప్రజల విధేయతను మార్చడం ద్వారా, ప్రజల వ్యవహారశైలిని మార్చడం ద్వారా, ప్రజలలో విశ్వాసాన్ని మార్చడం ద్వారా ఈ చర్యలు తమ శక్తిని ప్రదర్శిస్తాయి. ఇది నాటకీయంగా జరగొచ్చు. ఉదాహరణకు భారత స్వతంత్రసంగ్రామంలో ఇలాగే జరిగింది. అమెరికాలో పౌరహక్కుల ఉద్యమంలోను, వివిధ కార్మిక పోరాటాల్లోను (అరవైలలో సంయుక్త వ్యవసాయ కూలీల ఉద్యమం), దక్షిణాఫ్రికాలోని జాతివివక్ష పోరాటం (1980 -1990), స్లోబోడన్ మిలోసెవిక్

(2000), ఉక్రేయిన్ లో నిరంకుశ వ్యవస్థ (2004). లేదా ఈ మార్పులు నిగూఢంగా కూడా జరుగుతూ ఉండొచ్చు. ఎలాగంటే, ప్రజలు స్థానికంగా తమకు అవసరమైన వస్తువులు కొంటున్నప్పుడు కొన్ని ఉత్పత్తులను బహిష్కరించడం, లేదా ప్రత్యామ్నాయ ఆర్థికవ్యవస్థలు లేదా సంస్థలను ఏర్పరచుకోవడం జరగవచ్చు. ఇలాంటి అనేకానేక పద్ధతులు, ఎత్తుగడలు ఉండవచ్చు. ఇవన్నీ మూడు ప్రధానమైన తరగతులుగా కనబడతాయి. మొదటిది, కార్యాచరణ అంటే ప్రజలు తమకు అనుమతి లేని పనులు, చేయవద్దని వారించిన పనులు చేయడం; రెండవది, నిరాకరణ అంటే ప్రజలు తాము చేయవలసిన, చేయమని చెప్పిన పనులు చేయకపోవడం; మూడవది సంకీర్ణ పద్ధతి, అంటే ఈ రెండు పద్ధతులను కలిపి ప్రయోగించడం.

ప్రజల విధేయతలోను, వ్యవహారశైలిలోను  మార్పు తీసుకురావడానికి ముందు అసలు ప్రజలు విధేయత ఎందుకు చూపుతున్నారు, ఎందుకు వారి వ్యవహారశైలి ఒక ప్రత్యేకపద్ధతిలో ఉందన్నది అర్థం చేసుకోవాలి. దీనికి కారణాలు ఒక్కో సమాజంలో ఒక్కోవిధంగా ఉండొచ్చు. అయితే వివిధ కార్యకర్తలు, ఉద్యమాల్లో నా అనుభవాల ఆధారంగా నా దృష్టిలో వచ్చిన రెండు ప్రధాన కారణాలు ఏమంటే, ప్రజలు మరో ప్రత్యామ్నాయ వ్యవహారశైలి ఏదీ లేదనుకోవడం. లేదా తమ చర్యల వల్ల ఎలాంటి మార్పు రాదన్న ఆత్మవిశ్వాస లోపం. సమాజంలో అసలైన అధికారం తమ చేతుల్లోనే ఉందన్నది ప్రజలు సాధారణంగా గుర్తించరు. విద్యాబోధన, కార్పోరేషన్లు, ప్రభుత్వం, మీడియా అన్ని కూడా నిజమైన అధికారం కొన్ని ప్రభుత్వ భవనాల్లో, కార్పోరేట్ కట్టడాల్లో కొందరి చేతుల్లో ఉంటుందని, సంపద, ఆయుధాలు (ఈ రెండింటిపై వారికే అధికారం ఉంటుంది) ఇవే అధికారానికి వనరులనీ భావించేలా చేస్తాయి. ఈ భావన వారి ప్రయోజనాలకు అనుకూలమైనది. చరిత్రలో విజయవంతమైన అహింసాయుత ఉద్యమాలన్నీ ప్రజలను జాగృతపరిచాయి. సామూహిక చర్యల ద్వారా ప్రజలు, ఒక ఉమ్మడి ఆశయం కోసం ఏకమైన ప్రజలు, వ్యూహాత్మకంగా పోరాడే ప్రజలు సాయుధ సైన్యాల కన్నా, సంపద కన్నా బలమైన వారని చరిత్ర చెబుతోంది. ఏ సమకాలీన అట్టడుగు పోరాటమైనా సరే విజయం సాధించాలంటే ఈ వాస్తవాన్ని గుర్తించాలి. ప్రజలే అత్యంత శక్తిసంపన్నులన్న వాస్తవాన్ని చాటి చెప్పాలి.

ఇంకాస్త వివరంగా చెప్పుకోవాలంటే, విజయాలు సాధించిన ఉద్యమాలు ప్రజలే అత్యంత శక్తిసంపన్నులని చెప్పడంతో సరిపెట్టుకోవు. స్పష్టమైన, సాధించగలిగిన లక్ష్యాలను నిర్దేశించడం ద్వారా ప్రజాశక్తి బలమెంతో ఆచరణాత్మకంగా ప్రదర్శిస్తారు. ఆ తర్వాత విజయాలను రికార్డు చేసి ప్రచారంలోకి తెస్తారు. ఇవి చిన్న చిన్న విజయాలే కావచ్చు, కాని ప్రజలను సమీకరించడంలో ఇవి చాలా తోడ్పడతాయి. ఉదాహరణకు, అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం 1955-56లో మోంట్గోమేరి, అలబామాలలో బస్సులలో ప్రత్యేక తరగతులను నిరాకరించడం ద్వారా, అలాగే నాష్ విలే లో 1960లో లంచ్ కౌంటర్లలో ప్రత్యేకతరగతులను నిరాకరించడం ద్వారా బలం పుంజుకుంది. భారత స్వతంత్ర సంగ్రామం 1930-31లో ఉప్పు చట్టం తదితర చట్టాలకు సంబంధించి బ్రిటీషు వారి నుంచి మినహాయింపులు సాధించడం ద్వారా బలంపుంజుకుంది. దక్షిణ అమెరికాలో జాతివివక్షను పూర్తిగా రూపుమాపడం, భారతదేశంలో స్వతంత్రం సాధించడం ఇవి చాలా పెద్ద లక్ష్యాలు, వాటితో పోల్చితే ఈ విజయాలు చాలా చిన్నవి. కాని, ఈ విజయాలు పోరాటంలో కొత్త ఉధృతిని, కొత్త జీవాన్ని పోశాయి. ఈ విజయాల వల్ల ప్రజలకు తమ బలం ఏమిటో తెలిసింది. తమ చర్యల వృథాగో పోవన్న నమ్మకం కుదిరింది. మార్పు సాధించే సామర్థ్యం ఉందని రుజువయ్యింది. ఫలితంగా ఉద్యమానికి ప్రజామద్దతు పెరిగింది. ప్రజల భాగస్వామ్యం పెరిగింది. ఉద్యమం జాతీయ, అంతర్జాతీయస్థాయికి చేరుకునే వేగం పెరిగింది.

అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం కాని, భారతదేశంలో స్వతంత్ర సంగ్రామం కాని సాధించిన ఈ విజయాలు నైతికంగా ఉన్నతమూల్యాల కారణంగా మాత్రమే దొరికినవి కావు. కష్టపడి పనిచేయడం, సృజనాత్మకంగా పనిచేయడం, రాజకీయ విశ్లేషణల్లో సమర్థవంతంగా వ్యవహరించడం వల్ల కూడా లభించాయి. అహింసాయుత పోరాటాల్నింటికీ ఇది వర్తిస్తుంది. కాని చాలా మంది ఈ వాస్తవాలపై దృష్టిపెట్టరు. అహింసాయుత చర్యలంటే నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు అనుకుంటారు. నైతిక మూల్యాల ప్రకారం పనిచేయడం అనుకుంటారు. లేదా గొప్ప చరిష్మా కలిగిన నాయకుని వెంట నడవడం అనుకుంటారు. లేదా ఏదో మార్మిక శక్తి సాధించే విజయాలని భావిస్తారు. ఇదేమీ కాదు. అలాగే నైతికంగా అహింసకు కట్టుబడడం, అహింస సిద్ధాంతాన్ని ఆచరించడం అనేది కూడా ఇందులో లేదు.

ఇందులో ముఖ్యమైనది ఏమంటే ప్రజలందరినీ కలుపుకోగలిగే ఆశయం. బలమైన వ్యూహాత్మక పథకరచన, ప్రజలతో కమ్యునికేషన్ చక్కగా ఉండడం, పరిస్థితులకు తగిన ఎత్తుగడలను గుర్తించి అమలు చేయడం ఇవి ముఖ్యమైనవి. అన్నింటికి ఒకే మంత్రంగా చెప్పే పద్ధతి ఏదీ లేదు. అహింసాయుత సంఘర్షణ అనేది ప్రత్యేక ప్రాంతానికి సంబంధించి ప్రత్యేకంగా ఉండొచ్చు. అయితే అహింసాయుత పోరాటాన్ని నడిపించే సూత్రాలు, అంటే ప్రజల సమ్మతి, విధేయతలపైనే అధికారం ఆధారపడి ఉండడం అన్నది ప్రతి పోరాటంలోను మారని అంశం. ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టడమన్నది ఒక సమాజంలో పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అది భారీ ప్రజా ప్రదర్శన రూపంలో కావచ్చు, లేదా ఉత్పత్తుల బహిష్కరణ వంటి చిన్నస్థాయిలో కావచ్చు. లేదా ఈ రెండూ కలిసిన ప్రతిఘటన కావచ్చు (చాలా ఉద్యమాల్లో అనేకానేక ఎత్తుగడలు, పద్ధతులు కనిపిస్తాయి. ప్రజలు వివిధ స్థాయిల్లో పాలుపంచుకునేలా రూపొందించిన పోరాటవ్యూహాలుంటాయి). ఈ సూత్రం ప్రజలకు సృజనాత్మకంగా తమ స్థాయిలో సమాజంలో తమదైన రాజకీయ ఉనికిని చాటి చెప్పే అవకాశాన్నిస్తుంది. ఆ విధంగా ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకొచ్చి పైచేయి సాధించే అవకాశాలు కల్పిస్తుంది.

అదృష్టవశాత్తు గొప్ప విజయాలు సాధించడానికి అహింసాయుత సంఘర్షణను ప్రజలు ఎలా ఉపయోగిస్తున్నారు, చరిత్రలో ఎలా ఉపయోగించారు అన్న విషయమై పరిశోధనలు, మేధోపరమైన కసరత్తులు చాలా జరుగుతున్నాయి. అహింసాయుత సంఘర్షణలో ఉన్న బలం, శక్తిసామర్థ్యాలను గుర్తించిన వారిలో ఈ సమాచారాన్ని తెలుసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. దీని గురించి వార్తాపత్రికల్లో కనబడదు. రాజకీయ నాయకులు దీని గురించి మాట్లాడడం వినబడదు. కాని అట్టడుగు ప్రజాప్రతిఘటనల నిర్వాహకులతో మాట్లాడితే లేదా పౌరసమాజం సభ్యులతో మాట్లాడితే వారు దీని గురించి చెబుతారు. సమాజంలోని ప్రజలే మార్పుకు కారకులని, నిర్మాణాత్మక మార్పు అనేది అట్టడుగు స్థాయి నుంచి పైకి వస్తుందని వారు గుర్తిస్తారు. వారు ఎవరో నాయకత్వం వహిస్తారని ఎదురు చూడరు. ఎందుకంటే ప్రభుత్వంలో కాని, కార్పోరేట్లలో కాని చాలా మంది నాయకులకు ప్రజలు సామూహిక కార్యకలాపాల నుంచి తప్పుకుంటే ఏం చేయాలో తెలియదని, ప్రజలపై బాధ్యత ఎలా మోపాలో తెలియని అయోమయంలో పడిపోతారన్నది అట్టడుగు పోరాటాల్లో

ఉన్నవారికి తెలుసు. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా ఇప్పుడు అహింసాయుత సంఘర్షణలవైపు చూస్తున్నారు. (మార్పు కోసం ఉపయోగపడే ఎన్నికల్లో ఓటేయడం, న్యాయవ్యవస్థను ఉపయోగించడం వంటి సంప్రదాయిక పద్ధతులతో పాటు కలిపి ఇతర ఎత్తుగడలను కూడా ఉపయోగిస్తున్నారు). సమాజాల సాధికారికతకు అహింసాయుత సంఘర్షణ ఆచరణాత్మక పద్ధతిగా భావిస్తున్నారు. మానవహక్కులు, స్వేచ్ఛలు, న్యాయం, పారదర్శకత, మహిళలు, ఆదివాసీలు, మైనారిటీల హక్కులు, పర్యావరణ పరిరక్షణలను సాధించుకోడానికి ఆచరణాత్మక పద్ధతిగా గుర్తిస్తున్నారు. అహింసాయుత సంఘర్షణ ఏ లక్ష్యంతో అయినాగాని దానికి అవసరమైన సూత్రం ఒక్కటే. ప్రజల మనస్సుల్లో అసలు అధికారం వారిదే అన్న భావనను బలోపేతం చేయడం. పరిజ్ఞానాన్ని పెంచడం, అవగాహన కల్పించడం, ప్రజలను జాగృతపరచడం – ఇవే మానవాళి దశ దిశను మార్చే కీలకమైన అంశాలు.